క్లుప్తంగా

నేడు ఉచితంగా కంటి పరీక్ష శిబిరం

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లోని వనస్థలిపురం మ్యాక్సి విజన్ శ్రీ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో రిటైర్డు ఉద్యోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నూకల జగదీష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డు ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షల తోపాటు ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్లకు ఎంపిక చేయబడినవారికి ఆస్పత్రి యాజమాన్యమే హైదరాబాద్‌లో ఆపరేషన్ చేసి తిరిగి నల్లగొండకు చేరుస్తారని తెలిపారు.

నేషనల్ ఎడ్యుకేషన్ డే సెమినార్



మాట్లాడుతున్న నజీర్

రామగిరి (నల్లగొండ): అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం నల్లగొండలోని టీఎస్ జీఓ భవనంలో యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ముస్లిం మైనారిటీ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యత, విద్యకు దూరమవుతున్న కొన్ని వర్గాలకు విద్యపై అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ పాష, డాక్టర్ యేకుల రాజారావు, డాక్టర్ అన్సారీ, మసియుద్దీన్, ఖాజా ముహిత్, కొండ లలిత, నజీర్, రఫీ, షేక్ సద్దాం, జహంగీర్, రియాజ్, అహ్మద్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

నల్లగొండ టౌన్: బెస్టు సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని చారుమతి చైల్డ్ కేర్ సెంటర్‌లో గల బాలబాలికలకు సొసైటీ వ్యవస్థాపకుడు బుక్కా ఈశ్వరయ్య దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రతి చలికాలంలో బచ్చు విక్రమ్ సహకారంలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని ఈశ్వరయ్య తెలిపారు. కార్యక్రమంలో బుక్కా సువర్ణ, ఉప్పల కోటయ్య, ఎస్‌కె.బిస్వాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్ : మండలంలోని ఆర్లగడ్డగూడెం 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ఏఈ సాయిగణేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా మర్రూర్, చందుపట్ల, సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వల్లభాపురం వాసికి డాక్టరేట్



తిరుమలేష్

నకిరేకల్ : మండలంలోని వల్లభాపురం గ్రామానికి చెందిన అబ్బగోని తిరుమలేష్‌కు ఉస్మానియా యూనివర్సిటీవారు డాక్టరేట్ ప్రదానం చేశారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎ.నర్సింగరావు పర్యవేక్షణలో జియాలజీ విభాగంలో ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో గ్రానైట్ గనుల వల్ల ఉపయోగకర భూమి తరుగుదల, వాతావరణంలో కలిగే మార్పుల అంచనాలపై పరిశోధనలు పూర్తి చేసినందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రకటించారు. తిరుమలేష్ ప్రాథమిక విద్యను వల్లభాపురం, 6 నుంచి 10వ తరగతి వరకు నకిరేకల్ జెడ్పీ హైస్కూల్, ఇంటర్ నల్లగొండ, డిగ్రీ ఎన్జీ కళాశాలలో చదివారు.

సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ లక్ష్యం

కేతేపల్లి: ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తూ సుపరిపాలన అందించడమే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంపసాట శ్రీనివాసయాదవ్ అన్నారు. కేతేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజలను మాయమాటలతో వంచనకు గురి చేసిందన్నారు. అందుకే ప్రజలు గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వెన్నుపోటు రాజకీయాలకు పెట్టింది పేరుగా నిలిచాడన్నారు. చిరుమర్తి లింగయ్య నియోజకవర్గంలో ఎక్కడ అభివృద్ధి చేశారో చూపించాలన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జటంగి వెంకటనర్సయ్య, అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి, బయ్య ముత్తయ్య పాల్గొన్నారు.

అసంపూర్తిగా మినీ ట్యాంక్ బండ్

- కాలంవారి కుంటకు వందేళ్లకు పైగా చరిత్ర
- గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఇప్పటికీ పూర్తికాని పనులు



గతంలో వెడల్పు చేసిన కాలం వారి కుంట కట్ట

నకిరేకల్ : పట్టణంలో మినీ ట్యాంక్ బండ్‌గా ప్రకటించిన కాలంవారి కుంట అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న నిజాం కాలం నాటి నకిరేకల్‌లోని కాలంవారి కుంటను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం కోసం గత ప్రభుత్వం రూ.4.64 కోట్ల నిధులు మంజూరు చేసింది. గత ఏడాది మినీ ట్యాంక్ బండ్ కోసం పనులు ప్రారంభించిన విషయం విదితమే. తొలి విడతలో రూ.75 లక్షల నిధులు విడుదలయ్యాయి. ఆ నిధులతో కట్ట వెడల్పు, ఒక వైపు బతుకమ్మ ఘాట్ నిర్మాణం, కట్ట లోపల భాగాన సగం వైపు రివిట్‌మెంట్ నిర్మాణం చేసి వదిలేశారు. ప్రస్తుతం కాలంవారి కుంట అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో రూ.4.64 కోట్ల నిధులు విడుదలయ్యాయి. అయితే ఆ నిధులను నకిరేకల్ పట్టణంలో పెద్ద చెరువు మరమ్మతుల కోసం రూ.2.64 కోట్లు, కాలంవారికుంట కోసం రూ.2 కోట్లు కేటాయింపులు చేస్తూ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. రెండు చెరువులకు నిధుల కేటాయింపులను ఆమోదిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు రాగానే పనులు చేపట్టనున్నారు.

పనులు పూర్తయితే..

ప్రస్తుతం రూ.4.64 కోట్లలో రూ.2 కోట్లు మాత్రమే కాలంవారి కుంట కోసం కేటాయించారు. ఆ నిధులతో మినీ ట్యాంక్ బండ్ పనుల్లో భాగంగా కట్టపైన సీసీ రోడ్డు, చెరువులో పూడికతీత, కట్టపై లైట్లు, పార్క్, కుంట లోతట్టు చుట్టూ వాకింగ్ చేసేలా రోడ్డు ఇతర పనులు కూడా చేపడతారు. లోతట్టు తోపాటు కట్టపైనే ఇకనుంచి ఎలాంటి ఆక్రమణలకు గురికాకుండా ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టనున్నారు. అధికారులు స్పందించి కాలంవారి కుంట అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాలంకారి కుంట పనులపై సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి.

వందేళ్ల నాటి చరిత్ర

నకిరేకల్ పట్టణానికి ఉత్తర భాగాన ఉన్న కాలం వారి కుంటకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ఉత్తర భాగాన ఉన్న ఈ కుంట కింద గతంలో వరి చేలు సాగయ్యేవి. నకిరేకల్ పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్న నేపథ్యంలో కుంట కింద ఉన్న భూములన్నీ గృహ ప్లాట్లుగా మారాయి. ఈ కుంట కింద దిగువన మూసీ రోడ్డు, డాక్టర్స్ కాలనీ, సుందరయ్యనగర్, రంగారెడ్డి నగర్, గీతా మందిరం, మార్కెట్ రోడ్డులతోపాటు దిగువన పలు కాలనీలు వెలిశాయి.. 40 వేల జనాభా ఉన్న నకిరేకల్ మున్సిపాలిటీకి ఈ కుంటలో నీరు ఉంటే భూగర్భ జలాలకు కొరత ఉండదు. అయితే కుంట ఆక్రమణలతో లోతట్టు ఆయకట్టు కొంతమేర తగ్గిపోయింది.

త్వరితగతిన ప్రారంభించాలి



మున్సిపాలిటీలోని 1,2వ వార్డుల పరిధిలో ఉన్న కాలం వారి కుంట అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలి. ఈ కుంట అభివృద్ధి చెందితే నకిరేకల్ పట్టణంలో సగం మేర భూగర్భ జలాలు పెరుగుతాయి. మినీ ట్యాంక్ బండ్‌గా మారితే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి కాలంవారి కుంట పనులు త్వరితగతిన ప్రారంభయ్యేలా చర్యలు తీసుకోవాలి.

–కందాల భిక్షంరెడ్డి, ఒకటో వార్డు కౌన్సిలర్

ప్రతిపాదనలు పంపాం



నకిరేకల్‌లోని కాలంవారి కుంటను మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం కోసం రూ.4.64 కోట్ల నిధులు మంజూరయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రతిపాదన మేరకు ఈ నిధులను పట్టణంలో పెద్ద చెరువుకు రూ.2.64 కోట్లు, కాలంవారి కుంట కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయిస్తూ కలెక్టర్ ఆమోదం కోసం పంపాం. కలెక్టర్ నుంచి ఉత్తర్వులు రాగానే రెండు చెరువుల్లో పనులు ప్రారంభిస్తాం.

–గౌతమ్, మున్సిపల్ ఏఈ, నకిరేకల్

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని సాయి మందిరం ఎదురుగా నూతనంగా నిర్మించిన డీటీఎఫ్ జోనల్ శాఖ కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగంలో డీటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డీటీఎఫ్ అధికార మాస పత్రిక ప్రధాన సంపాదకుడు డాక్టర్ ఎం.గంగాధర్ మాట్లాడుతూ శాస్త్రీయ విద్యావిధానం సాధించడం కోసం డీటీఎఫ్ చేస్తున్న పోరాటాలు ఆదర్శనీయమన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, టి.లింగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు భాస్కర్ ,శ్రీనివాస్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్, డీటీఎఫ్ పూర్వ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నాగయ్య, సంఘ ప్రతినిధులు బి.వి.రావు, లింగయ్య, ఎండీ ఖలీల్‌మియా, వెంకులు సత్తయ్య, యాకుబ్ అలీ, పోతుల గోపాల్, జనార్దన్‌రెడ్డి, మారోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రోడ్డుపైనే వారాంతపు సంత



మునుగోడులోని ప్రధాన రహదారిపై రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు

మునుగోడు: నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో ప్రతి గురువారం జరిగే వారాంతపు సంత మళ్లీ రోడ్డెక్కింది. మునుగోడు–నల్లగొండ ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గ్రామ పంచాయతీ అధికారులు సంతకు స్థలం కేటాయించారు. గతంలో ఆ సంతలో వ్యాపారులు కూరగాయలు, పండ్లు ఇతర వస్తువులు అమ్ముకోకుండా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెట్టి అమ్మేవారు. దీంతో ప్రతి గురువారం ట్రాఫిక్ సమస్య నెలకొనేది. ఈ విషయమై పలుమార్లు సాక్షి దినపత్రికలో కథనాలు ప్రచురించడంతో స్థానిక పోలీసులు చొరవ తీసుకుని సంత స్థలంలో వస్తువులు విక్రయించుకోవాలని వ్యాపారులకు సూచించారు. రెండు నెలల క్రితం గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయంతో పోలీసులు రోడ్డుపై వ్యాపారాలు చేసేవారిని బలవంతంగా సంతకు కేటాయించిన స్థలంలోకి మార్పించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీరింది. మళ్లీ రెండు వారాలుగా ఆ సంతలో వ్యాపారం చేసుకునేవారు గతంలో వలె రోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో గతంలో వలె ట్రాఫిక్ సమస్య మొదలైంది. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని గురువారం రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు బీ టీమ్‌గా మారిన బీజేపీ

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

కట్టంగూర్ : కాంగ్రెస్ పార్టీకి బీజేపీ బీ టీమ్‌గా మారిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. ఆదివారం కట్టంగూర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకుని రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. మూసీలో లక్షల కోట్ల రూపాయల అవినీతి జరుగుతుందని తెలిసి కూడా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి, సీఎం రేవంత్‌రెడ్డికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం త్వరలోనే బట్టబయలు కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని, రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ తరాల బలరాములు, దాసరి సంజయ్, గడుసు కోటిరెడ్డి, పెద్ది బాలనర్సింహ, నల్లమాద సైదులు, అంతటి శ్రీను ఉన్నారు.

బోరు ప్రారంభం

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామంలో మంచినీటి ఇబ్బందులు తొలగించేందుకు స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో రూ.75వేలతో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు, పైప్‌లైన్‌ను ఆదివారం ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు బిగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మందుల బీరప్ప, గ్రామశాఖ అధ్యక్షుడు దండు లింగస్వామి, ఆరెకంటి పాపయ్య, మందుల స్వామి, అద్దంకి రామలింగం, దాసు, చంద్రయ్య, సైదులు, రమేష్, రామరావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ తరగతులు

చండూరు : మిర్యాలగూడలో ఈ నెల 11న జరిగే ఏఐటీయూసీ జిల్లా శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు దోటి వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మిర్యాలగూడలోని కరీం ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు

చిట్యాల: నిరుద్యోగ యువతీయువకుల పక్షాన డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు చేస్తున్నామని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు, పిట్టంపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి నిర్వహించిన డీవైఎఫ్ఐ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో డీవైఎఫ్ఐ జెండాలు ఎగురవేసి భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి వడ్డెగాని మహేష్, నర్సింహ, మెట్టు పరమేష్, ఆడేపు రమేష్, గడ్డం నర్సిరెడ్డి, ఏరుకొండ బసవయ్య, గోపాల్, కూరాకుల బాలు, గోలి సాయికిరణ్ పాల్గొన్నారు.

సర్వేలో ఎలాంటి తప్పులు ఉండవద్దు



మునుగోడు: తేరట్‌పల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీదేవి



నార్కట్‌పల్లి : శాపల్లి గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

మునుగోడు: ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మురళి ఎన్యుమరేటర్లకు సూచించారు. మునుగోడు మండలంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి యజమానులను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా వివరాలు సేకరించాలన్నారు. ఎవరైనా ఇష్టంలేక వివరాలు చెప్పకపోతే బలవంతం చేయవద్దన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయభాస్కర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

చండూరు (గట్టుప్పల్) : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని చండూరు ఆర్డీఓ శ్రీదేవి అన్నారు. గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆదివారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు పూర్తి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు రాములు, కార్యదర్శి షఫి, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సర్వేలో అన్ని వివరాలు సేకరించాలి

నార్కట్‌పల్లి : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అన్ని వివరాలు సేకరించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు ఎన్యుమరేటర్లకు సూచించారు. నార్కట్‌పల్లి మండల పరిధిలోని శాపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను ఆదివారం మండల గణాంక అధికారి మల్లికార్జున్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సక్రమంగా అన్ని విషయాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గోలి కరుణ, లలిత ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నల్లగొండ రూరల్: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆర్జాలబావి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఇబ్బంది పడకుండా తేమశాతం 17 ఉన్నా ధాన్యాన్ని వేగవంతంగా తూకం వేయాలన్నారు. లారీల సమస్య, హమాలీల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్జాలబావిలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

తిప్పర్తి : ప్రభుత్వం తిప్పర్తి మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో జరిగిన సీపీఎం 8వ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక చేయూత



నార్కట్‌పల్లి : ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న స్నేహితులు



శాలిగౌరారం: నగదు అందజేస్తున్న స్నేహితులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఏనుగులదోరి గ్రామానికి చెందిన వనజాత భర్త ఇటీవల మృతి చెందాడు. దీంతో 2006–07 విద్యా సంవత్సరంలో వనజాతతో కలిసి ఎస్సెస్సీ చదివిన స్నేహితులు ఆదివారం ఆమెను పరామర్శించి రూ.60 వేలను వనజాత కూతురు పేరున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దామెర ఉదయ్, జెనిగ కృష్ణ, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం: మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన కప్పల సురేశ్ తండ్రి ఇటీవల మృతిచెందాడు. సురేశ్‌తోపాటు 2006–07 విద్యా సంవత్సరంలో మాధారంకలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీతోపాటూ 7వ తరగతి చదివిన స్నేహితులు ఆదివారం సురేశ్‌ను పరామర్శించి రూ.13 వేల ఆర్థికసాయం అందజేశారు.

అలరించిన సదర్ సమ్మేళనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



పోతురాజుల విన్యాసాలు



దున్నపోతుల విన్యాసాలను తిలకిస్తున్న ప్రజలు

రామగిరి (నల్లగొండ) : కాంగ్రెస్ ప్రభుత్వం సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం రాత్రి నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన సదర్ సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలతో కలిసిమెలిసి జీవించే మనస్తత్వం యాదవులకుందని అన్నారు. సదర్ వల్ల అన్ని వర్గాల ప్రజల్లో ఐక్యత భావం పెరుగుతుందని, ఈ ఉత్సవం గ్రామీణ ప్రాంతాలకు వ్యాప్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలించారు. పోతురాజుల ఆటలు, దున్నపోతుల విన్యాసాలను తిలకించేందుకు జనాలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో చిన్న శ్రీశైలంయాదవ్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, నిర్వాహకులు మేకల యాదన్నయాదవ్, దూదిమెట్ల సత్తయ్య, పిల్లి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, ఎల్.వి.యాదవ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టి జానయ్యయాదవ్, సత్యనారాయణ, శివకుమార్, వంశీకుమార్, సంగి లక్ష్మణ్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీ ఎన్నిక



వీరస్వామి, జిల్లా అధ్యక్షుడు

నకిరేకల్ : పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన మానవ హక్కుల వేదిక జిల్లా మహాసభలో జిల్లా కమిటీని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అక్కెనపల్లి వీరస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా అద్దంకి దశరథ, జిల్లా ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, సీహెచ్ గురువయ్య, సహాయ కార్యదర్శులుగా బీఎస్ఎస్ ప్రసాద్, మోత్కురి శ్రీను, సీహెచ్ కాశీరాం, సభ్యులుగా మధు, వెంకటరమణ, ఉదయ్‌కుమార్, మురళీకృష్ణ, జరీనా ఎన్నికయ్యారు.

బియ్యం అందజేత

చిట్యాల: పట్టణంలోని రెండో వార్డుకు చెందిన దండిగ నర్సింహకు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక చేతిని తొలగించారు. అతడిని ఆదివారం ఆ వార్డు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కోనేటి ఎల్లయ్య పరామర్శించి యాభై కేజీల బియ్యం అందజేశారు.

కరపత్రాలు విడుదల

నకిరేకల్ : పట్టణంలోని సాయి మందిరంలో ఈ నెల 13న నిర్వహించనున్న చిల్కు ద్వాదశి పర్వదిన వేడుకల ప్రచార కరపత్రాలను ఆదివారం ఆ మందిర ప్రధాన కార్యదర్శి యాటా మధుసూదన్‌రెడ్డి విడుదల చేశారు. 13న సాయి మందిరంలో విశేష పూజ, అభిషేకాలు, దీపాలు వెలిగించే కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ట్రస్ట్ ప్రతినిధులు ఉప్పల వెంకటరమణ, తొనుపునూరి రాంబాబు, బండారు వేణుగోపాల్, జొన్నలగడ్డ శ్రీనివాస్, వలిశెట్టి స్వప్న, పిల్లమర్రి సునిత, తులసి, కోట రామచొక్కం పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రతినిధులు

మూలమలుపు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

శాలిగౌరారం: మండలానికి ప్రధాన రహదారిగా ఉన్న నకిరేకల్–శాలిగౌరారం ప్రధాన డబుల్ రోడ్డు వెంట వల్లాల గ్రామ బస్టాప్ సమీపంలో ఉన్న రెండు సిమెంట్ పైపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. బీటీ రోడ్డుకు ఆనుకుని సిమెంట్ పైపులు ఉండడంతో రోడ్డున వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిమెంట్ పైపులు ఉన్నచోట మూలమలుపు కూడా ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. డబుల్ రోడ్డు కావడంతో వాహనదారులు గరిష్ట వేగంగా వాహనాలను నడుపుతుండడంతో సిమెంట్ పైపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల రాత్రి సమయంలో నకిరేకల్ నుంచి శాలిగౌరారంకు ద్విచక్ర వాహనంపై వెళుతూ ఎదురుగా మరో వాహనం రావడంతో లైట్ల ఫోకస్‌కు ఎదురుగా ఏమీ కనిపించక రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ పైపులను బలంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వల్లాల వద్ద ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ పైపులు

నూతన కమిటీ ఎన్నిక

చండూరు : ఆర్య వైశ్య సంఘం చండూరు పట్టణ, మండల నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా తడకమళ్ళ శ్రీధర్, కార్యదర్శిగా తాడిశెట్టి వెంకన్న, కోశాధికారిగా దాచేపల్లి సంపత్, పట్టణ అధ్యక్షుడిగా తాడిశెట్టి సంతోష్, కార్యదర్శిగా వాస రాంబాబు, కోశాధికారిగా చంద్రుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పేర్కొన్నారు. నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, పలువురు నాయకులు అభినందించారు.